# ఉపాయం

భగవంతరావు కొడుకు ధైర్యం చేశాడు.

భగవంతరావు ఆఫీసు నుంచి జీతం అందుకుని వచ్చి, చొక్కా విప్పి వంకీకి తగిలించి, స్నానాల గదిలోకి వెళ్ళగానే, తండ్రి చొక్కా లోంచి పర్స్ తీశాడు. తెరిచి లెక్కపెట్టాడు. ఆరు వంద రూపాయల నోట్లు కొంత చిల్లర. రెండు "వంద" రూపాయల నోట్లు తీసి జేబులో వేసుకుని ఆ పర్స్‌ని కూడా తన జేబులోనే వేసుకున్నాడు.

స్నానం ముగించి సంధ్య వార్చాక ఇంటాయనకి అద్దె ఇవ్వడానికి చొక్కా జేబులు, పేంట్ జేబులు వెదికాడు పర్స్‌కోసం. జీతంతో నిండిన పర్స్ కనబడలేదు. మాయమయింది!

ఇంటికి వచ్చేదాకా అది జేబులోనేవున్నట్లు గుర్తు భగవంతరావుకి. ఆ తర్వాత ఆ ఇంట్లో గంటదాకా అరుపులు, అనుమానాలు, కన్నీళ్ళు.

భగవంతరావు కొడుకు మర్నాడు వుదయం తనకు ప్రాణమిత్రుడయిన ఓ పోలీస్ కాన్‌స్టేబుల్ దగ్గరికి వెళ్ళాడు.

"చిన్న సహాయం చేయాలి గురూ!" అన్నాడు తండ్రిజేబులోంచి దొంగిలించిన పర్స్‌ని కాన్‌స్టేబుల్‌కిచ్చి, ఓ పావు గంటసేపు విడమరిచి చెప్పాడు ఆ సాయంత్రం కాన్‌స్టేబుల్ ఏం చేయాలో.

కానిస్టేబుల్ పర్సు తెరిచి, నాలుగువందల అరవై చిల్లర వుంది. నువ్వు రెండువందలు కాజేశావా?"

"మా నాన్నలా గుర్రప్పందాలకు తగలెయ్యను. మా అమ్మ చాలా రోజులనుంచి ముచ్చటపడుతున్న, తాకట్టులో వున్న బంగారపు గొలుసు విడిపిస్తానంతే"

ఆ సాయంత్రం భగవంతరావు దగ్గరకి వచ్చి అడిగాడుకానిస్టేబుల్ "భగవంతరావుగారుండేది ఇక్కడేనా?"

"అవును ఏం" అన్నాడు భగవంతరావు.

"మీ వస్తువేదయినా పోయిందా?"

"పర్సు పోయింది. దాంట్లో ఆరువందల అరవై దాకా వుండాలి. మీగ్గాని దొరికిందా?" అడిగాడు భగవంతరావు.

తలవూపి చెప్పాడు తన మామూలు ధోరణిలోపోలీస్ కానిస్టేబుల్ "నిన్న బస్‌లో జేబులు కొట్టే పిక్‌పాకెటర్‌ని పట్టుకుంటే అయిదారు పర్సులు దొరికాయి. ఒకటి మీది, ఎవరివి వాళ్ళకు అందజేస్తున్నాం. ఎంత వుందన్నారు పర్సులో."

"ఆరువందల అరవై"

"మీరు దురదృష్టవంతులు, అదృష్టవంతులు కూడా. రెండూనూ. రెండువందలు ఖర్చుపెట్టేశానని చెప్పాడు, నాలుగువందల అరవై మిగిలి వుంది చూసుకోండి" అందించాడు పర్సుని.

భగవంతరావు లెక్కపెట్టి తృప్తిగా నిట్టూర్చి, ఆ పోలీస్‌కి బహుమతిగా ఇరవై రూపాయలు ఇచ్చాడు

తను రేసుల్లో ఖర్చు చేయదలుచుకున్న రెండువందలు పోయినా, ఇంటి ఖర్చుకు సరిపడే నాలుగువందల అరవై రెండు రూపాయలు లభించడంతో ఏనుగెక్కినంత సంతోషపడ్డాడు భగవంతరావు. రెండురోజుల తర్వాత ఆ బంగారుగొలుసు విడిపించాడు భగవంతరావు కొడుకు, తను దాచుకున డబ్బుతో.